సాక్షి
ములుగు
గురువారం । 14 । ఆగస్టు । 2025



కాకతీయుల శిల్పకళ అద్భుతం

కాకతీయుల శిల్పకళ అద్భుతమని, నాటి సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనమని కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు.

- 8లో▸



పీటలపై ఆగిన పెళ్లి..

పెళ్లికొడుకు తనతో ప్రేమాయణం సాగించాడని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పెళ్లిపీటల మీదనే మూడుముళ్ల బంధం ఆగింది.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
26⁰/22⁰

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

పొడిగించేనా..?

నేటితో ముగియనున్న పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు

- మరో ఆరు నెలలు పొడిగించాలంటున్న పాలకవర్గాలు
- ప్రత్యేక పాలననా.. నామినేటెడ్‌తో భర్తీనా..?
- ప్రభుత్వ ఆదేశాల కోసం ఉత్కంఠ

వెంకటాపురం(ఎం): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్)కు సర్కార్ పొడిగించిన ఆరు నెలల పదవీ కాలం గడువు నేటితో (గురువారం) ముగియనుంది. మరో ఆరు నెలలు పొడిగిస్తారా.. లేదా అనే విషయమై ఇప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. పీఏసీఎస్‌లకు 2020 ఫిబ్రవరి 15న ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 16న చైర్మన్లను ఎన్నుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16తో ఐదేళ్ల పదవీ కాలం ముగిసింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ఆరు నెలల పదవీ కాలాన్ని పొడిగించింది. పొడిగించిన పదవీ కాలం గురువారంతో ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు పాలకవర్గాల కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో అటు అధికారులు, ఇటు పాలకవర్గ సభ్యుల్లో ఉత్కంఠ నెలకొంది. మరో ఆరు నెలల గడువు పొడిగించాలా లేదా పాలకవర్గాలను రద్దు చేసి పీఏసీఎస్, డీసీసీబీ చైర్మన్లను నామినేటెడ్ పద్ధతిలో నియమించాలా అనే విషయమై ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పీఏసీఎస్ పాలకవర్గాల గడువు మరో ఆరు నెలలు పొడగించాలని పీఏసీఎస్ చైర్మన్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 99 పీఏసీఎస్‌లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 99 పీఏసీఎస్ సంఘాలు ఉండగా 2.5 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వరంగల్ పరిధిలో 28, హనుమకొండ పరిధిలో 16, జనగామలో 14, మహబూబాబాద్ పరిధిలో 19, ములుగు పరిధిలో 12, జయశంకర్ భూపాలపల్లి పరిధిలో 10 పీఏసీఎస్ సంఘాలు ఉన్నాయి. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను ఏర్పాటు చేసింది. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు పంట రుణాలు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. అంతేకాకుండా పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేసి రైతాంగానికి ప్రభుత్వ మద్దతు ధర అందేలా చూస్తున్నారు. ప్రతీ ఐదేళ్లకోసారి పీఏసీఎస్‌లకు ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా పాలకవర్గాలను నియమిస్తారు. ప్రతీ సొసైటీకి సీఈఓతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు ఉంటారు. పాలకవర్గాల గడువు గురువారంతో ముగియనుండడంతో ప్రత్యేక పాలన విధిస్తారా.. మరో ఆరు నెలలు పొడిగిస్తారా అనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది.



వెంకటాపురం(ఎం) పీఏసీఎస్ కార్యాలయ భవనం

నామినేటెడ్ పద్ధతిలో..

ప్రాథమిక సహకర సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పద్ధతి అమలు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందని తెలుస్తోంది. గత ఎన్నికల ముందు పార్టీ కోసం కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు అండగా నిలిచి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాదిరిగానే సహకార సంఘాల్లోనూ నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాన్ని నియమించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. 2020లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన పీఏసీఎస్ ఎన్నికల పాలకవర్గాన్ని రద్దు చేసి ప్రత్యేక అధికారులను నియమించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన వెంటనే నామినేటెడ్ పద్ధతిలో పీఏసీఎస్‌లకు పాలకవర్గాన్ని భర్తీ చేయనున్నట్లు తెలిసింది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



పీఏసీఎస్ పాలకవర్గాల గడువు గురువారంతో ముగియనుంది. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చే వరకు ప్రస్తుత పాలకవర్గం కొనసాగుతుంది. గురువారం లోగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉంది.

- సర్దార్‌సింగ్, డీసీఓ

ఉదయం 9.30 గంటలకే పతాకావిష్కరణ

- పంద్రాగస్టు వేడుకలకు ప్రభుత్వం ఉత్తర్వులు
- ములుగులో మంత్రి సీతక్క



సాక్షిప్రతినిధి, వరంగల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం పంద్రాగస్టు రోజున జిల్లాకేంద్రాల్లో ఉదయం 9.30 గంటలకే జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల వారీగా వేడుకలకు హాజరయ్యే మంత్రులు/ప్రముఖుల జాబితాను బుధవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు విడుదల చేశారు. హనుమకొండ జిల్లా పోలీసు పరేడ్‌గ్రౌండ్స్‌లో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. వరంగల్‌లో రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ములుగులో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. అదే విధంగా మహబూబాబాద్‌లో డిప్యూటీ స్పీకర్ జె.రామచంద్రునాయక్, జనగామలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జయశంకర్ భూపాలపల్లిలో తెలంగాణ ఎస్టీ కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌లు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం గార్డ్ ఆఫ్ ఆనర్‌లో గౌరవ వందనం స్వీకరిస్తారని, అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలని చీఫ్ సెక్రటరీ ఆ ఉత్తర్వుల్లో జిల్లా కలెక్టర్‌లకు సూచించారు.

వంతెన పనులు త్వరగా పూర్తిచేయాలి

కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు రూరల్: మల్లంపల్లి–ములుగు జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జి కుంగిపోవడంతో మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్. దివాకర సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం బ్రిడ్జి నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా జాతీయ రహదారిపై ఉన్న పాత బ్రిడ్జి కుంగిపోవడంతో రవాణాకు అంతరాయం కలిగిందన్నారు. జాతీయ రహదారి అధికారులు తాత్కాలిక వంతెన నిర్మాణ పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భారీ వాహనాల రాకపోకలను దారి మళ్లించాలని తెలిపారు. వరంగల్ నుంచి ములుగు వచ్చే భారీ వాహనాలను గూడెప్పాడు నుంచి పరకాల.. రేగొండ.. జంగాపల్లి మీదుగా వెళ్లేలా చూడాలన్నారు. తిరుగు ప్రయాణంలో అబ్బాపూర్..గోరుకొత్తపలి ..వరంగల్‌కు వెళ్లేలా చూడాలన్నారు. నర్సంపేట, ములుగు, వరంగల్ ఆర్టీసీ బస్సులు, కార్లు శ్రీనగర్ –పందికుంట మీదుగా మళ్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌హెచ్ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణ పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ దివాకర

ములుగుకు చేరుకున్న సైకిల్ యాత్ర

ములుగు రూరల్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మహిళా సాధికారితే లక్ష్యంగా కామారెడ్డి జిల్లాకు చెందిన భానోతు వెన్నెల చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం ములుగు జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో సైకిల్ యాత్రకు స్వాగతం పలికారు. మహిళా సాధికారతకు సైకిల్ యాత్ర చేపట్టడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మైపాల్ రెడ్డి, అన్వేష్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

రైతుల సంక్షేమమే ధ్యేయం



ములుగు రూరల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి అన్నారు. ఈ మేరకు బుధవారం ములుగు మార్కెట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి ప్రభుత్వమని తెలిపారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరిస్తామని వెల్లడించారు. లైసెన్స్ లేని పత్తి కొనుగోలు దారుల అక్రమాలను నివారించి రైతుల వద్ద నుంచి ప్రభుత్వమే పత్తి కొనుగోలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు సెద సారంగం, ఎల్లారెడ్డి, సీతారాం నాయక్, బాలయ్య, వెంకన్న, రామస్వామి, పగడయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంబోజ చెరువుకు బుంగ



ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని నర్సింగాపూర్ గ్రామంలో కాంబోజ చెరువుకు బుంగ పడింది. మంగళవారం రాత్రి భారీవర్షం కురియడంతో చెరువులోకి భారీగా వరద వచ్చి చేరడంతో చెరువు కట్టకు బుంగ పడింది. కట్ట తెగిపోయే ప్రమాదం ఏర్పడింది. దీంతో నర్సింగాపూర్ గ్రామ రైతులు వాట్సాప్ గ్రూపులో పెట్టడంతో తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి స్పందించి ఇరిగేషన్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో పాటు గ్రామ రైతుల సహకారంతో బుంగను పూడ్చివేతకు చర్యలు తీసుకున్నారు. అధికారులు పూర్తి స్థాయిలో బుంగ పూడ్చివేతకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



ములుగు రూరల్: ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన ములుగు మండలం జగ్గన్నగూడెంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జగ్గన్నగూడెం గ్రామానికి చెందిన దబ్బకట్ల శోభన్ (35) తన ట్రాక్టర్ తీసుకొని వ్యవసాయ పొలంలో దమ్ము చేసేందుకు వెళ్లాడు. దమ్ము చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ తిరగపడి శోభన్ బురదలో చిక్కుకుపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. రైతులు ట్రాక్టర్ కింద నుంచి శోభన్‌ను బయటకు తీసేసరికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిలలు ఉన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి



ములుగు రూరల్: రైతులు సాగు చేస్తున్న పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త శ్రవణ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు బుధవారం మల్లంపల్లి మండల పరిధిలోని మహ్మద్ గౌస్‌పల్లిలో పత్తి, వరి పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వరి నాట్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఉల్లికోడు నివారణకు కార్బోఫ్యూరాన్ 3సీజీ గుళికలను ఎకరానికి 10 కేజీల చొప్పున వాడాలని తెలిపారు. నాటిన 15 రోజుల్లో వినియోగించాలని సూచించారు. పత్తి పంటలో రసం పీల్చు పురుగు నివారణకు పసుపు, నీలి రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అంతర్గత మందులను ప్రిపోనిల్ 2 మిల్లీ లేదా ఏసీఫేట్ 1.5 గ్రాము లేదా ఫ్లోనిమిడ్ 0.3 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకార బుట్టలను అమర్చి నివారించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హరి, మానస, సౌందర్య, మండల వ్యవసాయ అధికారి శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

తునికాకు బోనస్‌లో అవకతవకలు

- కంప్యూటర్ ఆపరేటర్ భార్య, తల్లి పేరుతో రూ.లక్షలు స్వాహా
- ముందే చెప్పిన సాక్షి



బందెల రాము భార్య, తల్లి పేరుతో ఉన్న బ్యాంక్ స్టేట్‌మెంట్ పత్రాలు

ఏటూరునాగారం: మండలంలోని అటవీశాఖ కార్యాలయంలో తునికాకు బోనస్‌లో కూలీలకు డబ్బులు రాకుండా అవకతవకలు జరిగాయని సాక్షి ముందుగానే హెచ్చరించింది. ఇందులో అటవీశాఖ రేంజ్ అధికారి బాలరాజు శిక్షను అనుభవించారు. అదే విధంగా ఏటూరునాగారం సౌత్ రేంజ్ అటవీశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న బందెల రాము అక్రమాలకు పాల్పడినట్లు అధికారుల తనిఖీల్లో నిర్ధారణ అయినట్లు తెలిసింది. ఆపరేటర్ తన భార్య బందెల స్వాతి, తల్లి సారమ్మ ఖాతాల్లో అక్రమంగా పెద్ద మొత్తంలో డబ్బులు జమ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. భార్య బ్యాంకు ఖాతాలో రూ. 4 లక్షలు, తల్లి బ్యాంకు ఖాతాలో రూ. 2.89 లక్షలు అక్రమంగా జమ చేసి జేబులు నింపుకున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని ఈ ఏడాది మార్చిలో తునికాకు బోనస్‌లో చేతివాటం అంటూ సాక్షిలో కథనం ప్రచురితమైంది. అందులో ఓ కంప్యూటర్ ఆపరేటర్ తన బంధువుల పేరుపై లక్షలాది రూపాయలు ఖాతాల్లో జమ చేసుకొని అక్రమాలకు పాల్పడినట్లు కూడా వెల్లడైంది. కానీ అధికారుల అలసత్వం వల్ల ఐదు నెలల తర్వాత ఆ విషయం తేటతెల్లమైందని స్థానికుల్లో చర్చ సాగుతోంది. తునికాకు బోనస్ విషయంలో పెద్ద పెద్ద వాళ్ల చేతివాటం ఉన్నట్లుగా తెలుస్తోంది. కానీ ఆ విషయంపై సీబీఐ విచారణ చేపడితే సుమారుగా రూ. 5 కోట్ల మేర అక్రమార్కుల జేబుల్లోకి డబ్బులు వెళ్లినట్లు తేలుతుందని తునికాకు కూలీలు చెబుతున్నారు. 2023 నుంచి ఇప్పటి వరకు వచ్చిన తునికాకు బోనస్ డబ్బులు వారి ఇష్టారాజ్యంగా ఖాతాల్లో వేసుకున్నారని, తునికాకు బోనస్‌ను ఎవరూ పర్యవేక్షించకపోవడంతో అటవీశాఖలో పెద్ద ఎత్తున కుంభకోణం చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.


తునికాకు బోనస్‌లో చేతివాటం

మార్చి 20 న ప్రచురితమైన క్లిప్పింగ్

హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ములుగు రూరల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమై ములుగు ఏరియా వైద్యశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఒక కార్యక్రమం కాదని.. ఇది మన బాధ్యత అని తెలిపారు. స్వాతంత్ర్య యోధులకు మనమిచ్చే నివాళి అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, రమేష్, సురేందర్, రవీంద్రచారి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ములుగులో నిర్వహిస్తున్న ర్యాలీ



యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు

జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్

ములుగు రూరల్: యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని జిల్లా రవాణా శాఖ అధికారి బారగాడి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం రవాణాశాఖ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. మాదక ద్రవ్యాల రవాణా అరికట్టేందుకు చేస్తున్న పోరాటంలో భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, యువత పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న శ్రీనివాస్

ఒక్కో క్వారీ నుంచి లారీ

నెలలో కనీసం 15 ట్రిప్పులు.. రూ.3 లక్షలకుపైనే సంపాదన

- ఏజెన్సీ ప్రాంతంలో ఓ ఎస్‌ఐకి ఇది ఇసుకతో పెట్టిన విద్య
- ఇసుక క్వారీలనుంచి మామూళ్లతోపాటు ఇది అదనం
- డీజీపీ కార్యాలయానికి బాధితుల ఫిర్యాదులు



సాక్షిప్రతినిధి, వరంగల్: ఇసుక అక్రమ దందా ఉమ్మడి వరంగల్‌లోని కొన్ని ఠాణాల పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తోంది. పోస్టింగ్ కోసం ప్రయత్నం చేసేటప్పుడే చాలామంది ఎస్‌ఐలు, సీఐలు ఇసుక అక్రమ దందా సాగే ప్రాంతాలను ఎంచుకోవడమన్నది పరిపాటిగా మారింది. ఏ పోలీసు స్టేషన్ పరిధిలో ఎక్కువ వాగులు, ఇసుక, మొరం.. బెల్టుషాపుల దందా సాగుతుందో.. ఆ ఠాణాలే లక్ష్యం చేసుకుని చాలామంది పోస్టింగ్‌లు కొడుతున్నారు. ఆ తర్వాత నెలవారీ మామూళ్లు షరా మామూలుగా మారి... ఇసుక వ్యాపారులు తమ దందాను సాగించుకోవడం సర్వసాధారణం. కానీ కొందరు మామూళ్లతోపాటు టెండర్‌ల ద్వారా పొందిన క్వారీల నుంచి పుక్కిడికి లారీల్లో ఇసుక నింపి హైదరాబాద్‌కు పంపుతూ దందా నిర్వహిస్తున్నారు. అదనపు ఆదాయానికి రుచి మరిగిన ఇలాంటి వారు తమకు అనుకూలురైన నాయకులు, అధికారుల పేర్లు వాడుతూ వివాదాస్పదులు అవుతున్నారు. ఇదే తరహాలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంత ఏజెన్సీ ఏరియా ఠాణాలో పనిచేసే సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) ఒకరు నెలవారీవి 'మామూలు'గా తీసుకుంటూ ఇసుక దందాను నిర్వహిస్తుండటం ఇప్పుడు పోలీసుశాఖలోనే చర్చనీయాంశంగా మారింది.

అధికారికంగా 10 వరకు ఇసుక క్వారీలు ..

గోదావరి పరీవాహక ప్రాంతంలో 10 వరకు ఇసుక క్వారీలు అధికారికంగా నడుస్తున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ముందే అప్రమత్తమైన కాంట్రాక్టర్‌లు వేల క్యూబిక్ మీటర్లను ఇసుకను గోదావరి ఒడ్డున నిల్వచేసి ఆన్‌లైన్ ఆర్డర్‌లపై సరఫరా చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఓ ఠాణాలో పనిచేసే ఎస్‌ఐ.. ఆ ఠాణా పరిధితోపాటు చుట్టుపక్కల క్వారీల నిర్వాహకులనుంచి ఇసుకను ఉచితంగా నింపిస్తూ హైదరాబాద్‌కు తరలిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఒక్కో క్వారీనుంచి నెలలో రెండు నుంచి మూడు.. నెలలో మొత్తం 15 నుంచి 20 లారీల ఇసుకను సరఫరా చేస్తున్నారు. ఒక్కో లారీ యజమాని, డ్రైవర్‌లకు కిరాయి, డీజిల్ ఖర్చులు పోను రూ.5 వేలు మిగిలేలా చేస్తూ.. నెల మొత్తంలో సదరు ఎస్‌ఐ కనీసం రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు సంపాదిస్తున్నట్లు చెబుతున్నారు. ఎవరన్న క్వారీ, లారీ యజమానులు సహకరించకపోతే మైనింగ్, టీజీఎండీసీ, రవాణాశాఖ అధికారులతో బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

ఎస్‌ఐపై ఫిర్యాదులు..

మామూళ్లు ఇచ్చి దందా చేసుకోవడానికి అలవాటు పడిన ఇసుక వ్యాపారులు.. అదనంగా ఇసుక లారీలను నింపి పంపాలని ఇబ్బందులు పెడుతున్న సదరు ఏజెన్సీ ఠాణా ఎస్‌ఐపై ఇటీవల డీజీపీ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఆ జిల్లా పోలీసు ఉన్నతాధికారికి కూడా ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన సదరు వ్యాపారులు.. ఆ ఉన్నతాధికారి సెలవులో ఉన్నట్లు తెలుసుకుని డీజీపీ, అడిషనల్ డీజీపీలకు పంపినట్లు చెబుతున్నారు. సదరు ఎస్‌ఐపై ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచిల ద్వారా విచారణ జరిపించి నిజమని తేలితేనే చర్యలు తీసుకోవాలని ఆధారాలతో సహా ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. కాగా ఇసుక దందాపై ఓ సబ్ ఇన్‌స్పెక్టర్‌పై డీజీపీ స్థాయి అధికారికి ఆ ఏజెన్సీ జిల్లా నుంచి ఫిర్యాదు చేయడం ఇదే మొదటిసారి కావడంతో పోలీసుశాఖలో కలకలంగా మారింది.

విద్యావనరుల కేంద్రంలోకి వరదనీరు



విద్యావనరుల కేంద్రం నుంచి కంప్యూటర్‌ను బయటకు తీసుకువస్తున్న సిబ్బంది

మంగపేట: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం భవనంలోకి వరద నీరు వచ్చి చేరడంతో కార్యాలయ సిబ్బంది కస్తూర్బా విద్యాలయంలో బుధవారం విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. మండల కేంద్రంలోని కోమటిపల్లి క్రాస్ రోడ్డు నుంచి గంపోనిగూడెం తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు, బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై గల ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద లోతట్టు ప్రాంతంలోని విద్యావనరుల కేంద్రం భవనంలోకి చేరింది. దీంతో కార్యాలయంలో విధులు నిర్వర్తించే అవకాశం లేకపోవడంతో సిబ్బంది తాత్కాలికంగా కస్తూర్బా విద్యాలయంలో కొనసాగించారు. ప్రతీసారి సమస్య ఎదురవుతున్నా అధికారులు సమస్యను పరిష్కరించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

ఉధృతంగా జంపన్నవాగు



ప్రజలను వాగు దాటించేందుకు సిద్ధంగా ఉన్న పడవలు

- కొండాయి వద్ద మునిగిన పిల్లర్ల డయలు
- పడవలు ఏర్పాటు చేసిన అధికారులు

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి బ్రిడ్జి వద్ద మంగళవారం, బుధవారం కురిసిన భారీ వర్షానికి జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. జంపన్నవాగు నూతన బ్రిడ్జి కోసం వాగులో దింపిన డయలు నీట మునిగాయి. దీంతో కొండాయి, మల్యాల, ఐలాపురం, గోవిందరాజుల కాలనీలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు వాగుదాటే పరిస్థితి లేకపోవడంతో అధికారులు పడవలను ఏర్పాటు చేశారు. ఈ పడవల ద్వారానే రాకపోకలను సాగించాల్సి వస్తోంది. జంపన్నవాగు ఉధృతంగా రావడంతో బ్రిడ్జి పనులు ఆగిపోయాయి. వాగు అవతల ఉన్న గ్రామాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలకులు, జిల్లా అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేసినట్లు స్థానికులు తెలిపారు. రాత్రి వేళలలో వాగు దాటకుండా సిబ్బందితో పహారా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.



వాగులో మునిగిన బ్రిడ్జి పిల్లర్ల డయలు

పరికరాలు లేవు.. వైద్యం అందించలేము

- ఎంజీఎంలో కొనసాగుతున్న రెఫరల్ ట్రీట్‌మెంట్
- మూడు రోజులుగా వైద్యం కోసం క్యాజువాలిటీ ఎదుట పడిగాపులు
- సోషల్ మీడియా కథనాలతో రోగి వద్దకు వైద్యులు



బాధితుడిని వైద్యం కోసం తరలిస్తున్న పరిపాలనాధికారులు

ఎంజీఎం : పూర్తిస్థాయి వైద్యాధికారులు లేకపోవడం, హెచ్‌ఓడీలు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తుండడం, వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు జంకుతుండడం వెరసి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పెద్ద సార్లు ఉంటారు అని భరోసాతో వస్తున్న రోగులకు ఆశించిన మేర వైద్యం అందడం లేదు. అలాంటి ఘటనే ఇది. జూనియర్ వైద్యుల పర్యవేక్షణలో వందలాది మంది రోగులకు చికిత్సలు అందిస్తున్న క్రమంలో పైల్స్‌తో బాధపడే ఓ రోగికి ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యం అందించలేమని గెంటేసినంతా పనిచేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పరిపాలనాధికారులు క్యాజువాలిటీ వద్దకు పరుగులు పెట్టి సదరు రోగిని అడ్మిట్ చేసుకుని చికిత్స అందించడం మొదలు పెట్టారు. వివరాలోకి వెళ్తే.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొండూరు గ్రామానికి చెందిన బాచబోయిన రత్నాకర్ అనే వ్యక్తి కడుపునొప్పి భరించలేక భార్య బుచ్చమ్మతో కలిసి సోమవారం ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు పైల్స్ సమస్య ఉన్నట్లు గుర్తించారు. వైద్యం చేయడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేవని చెప్పి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి వెళ్లాలని రెఫర్ చేశారు. దీంతో ఏమీ తోచని స్థితిలో సదరు రోగి మూడు రోజులుగా ఎంజీఎం ఆస్పత్రి ఎదురుగా ఉన్న రేకుల షెడ్‌లోనే వేచి ఉన్నాడు. ఈ విషయం బుధవారం సోషల్ మీడియాలో రావడంతో వెంటనే ఎంజీఎం పరిపాలనాధికారులు కార్యాలయాలు వదిలి క్యాజువాలిటీ వద్దకు పరుగులు పెట్టారు. బాధితుడిని స్వయంగా అత్యవసర విభాగంలో చేర్పించి చికిత్స మొదలు పెట్టారు. కాగా, చివరకు మెరుగైన చికిత్స నిమిత్తం మళ్లీ హైదరాబాద్‌కు తరలించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో విద్యార్థి మృతి



షేక్ ఫరాజ్ అహ్మద్ మృతదేహం

శాయంపేట : ట్రాక్టర్ ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండలంలోని నేరేడుపల్లి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై పరమేశ్ కథనం ప్రకారం.. ఆత్మకూరు మండలం హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన షేక్ ఫరాజ్ అహ్మద్ (16) శాయంపేట మండలం నేరేడుపల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరి మంగళవారం పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటలకు ఇంటికి వెళ్లే సమయంలో పాఠశాల ఎదుట హౌజుబుజుర్గు గ్రామానికి చెందిన షేక్‌షబినాబీకి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ ఉమర్ నడుపుకుంటూ వస్తుండగా షేక్ ఫరాజ్ అహ్మద్‌తో పాటు కొంత విద్యార్థులు ఎక్కారు. ఈ క్రమంలో నేరేడుపల్లి శివారులోని మలుపు వద్ద డ్రైవర్ బ్రేక్ వేయగా ట్రాక్టర్‌లో కూర్చున్న ఫరాజ్ అహ్మద్ ఎగిరి రోడ్డుపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. వారి వెనుక వస్తున్న అదే గ్రామానికి చెందిన షేక్ కరీం.. ఫరాజ్ అహ్మద్ తల్లిదండ్రులకు సమాచారం అందించగా వారు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఫరాజ్ అహ్మద్ మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి షేక్ కమల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటాం..

- మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ల వాహనాలు సిద్ధం
- ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్

జనగామ: జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉందని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ తెలిపారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన రివ్యూలో ఎస్ఈ మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్ష ప్రభావంతో మండలాల వారీగా మానిటరింగ్ చేస్తున్నామని, సిబ్బంది, మెటీరియల్‌ను సిద్ధం చేసి ఉంచామన్నారు. అత్యవసర సమయంలో విద్యుత్ పునరుద్ధరణకు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనాలను సైతం అందుబాటులో ఉంచినట్లు స్పష్టం చేశారు. షిఫ్ట్ పద్ధతిలో ఉద్యోగులు 24 గంటల పాటు విధుల్లో ఉంటారన్నారు. గాలివాన బీభత్సంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే పునరుద్ధణ చేసేందుకు టీంలు సంఘటన స్థలికి చేరుకోవడంతో జాప్యాన్ని నివారించే చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకు సంబంధించి కంట్రోల్ రూం ఏర్పాటుతో పాటు టోల్ ఫ్రీ 1912 నంబర్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు, వినియోగదారులు సొంతంగా కరెంటు రిపేరు పనులు చేయొద్దని, కిందకు జారి వేళ్లాడుతున్న విద్యుత్ తీగలు, వదులుగా ఉన్న వాటిని తాకవద్దన్నారు. రైతులు తమ వ్యవసాయ అవసరాల నిమిత్తం నాణ్యతలేని వ్యవసాయ పంపు సెట్లను వినియోగించే సమయంలో కరెంటు మోటార్లు, ఫుట్ వాల్వులు, సర్వీసు వైర్లకు ఇన్సులేషన్‌కు విద్యుత్ ప్రసారం జరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ పంపు సెట్లు, స్టార్టర్లకు విధిగా ఎర్త్ ఉండేలా చూసుకోవాలని ఎస్ఈ వేణుమాధవ్ తెలిపారు.



ఎన్‌పీడీసీఎల్ శాఖ సిద్ధం చేసిన మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్ వాహనం



జిల్లాకు చేరిన రెస్క్యూటీం

జిల్లాకు చేరిన ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

భారీ వర్ష సూచన హెచ్చరికల నేపథ్యంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు బుధవారం రాత్రి జనగామ జిల్లాకు చేరుకున్నాయి. జిల్లాలో అత్యవసర సేవలు, కల్వర్టుల వద్ద ప్రమాదాలు, చెరువు కట్టలపై ముప్పు తదితర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను కాపాడేందుకు ఈ బృందంలోని ప్రతినిధుల లక్ష్యం.

అమృత బార్‌లో చోరీ

జనగామ: పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు ప్రధాన కూడలిలోని అమృతబార్‌లో బుధవారం చోరీ జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్సై భరత్, బార్ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12న రాత్రి బార్ మూసి వేసి ఇంటికి వెళ్లిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తి బార్ వెనకభాగం నుంచి లోనికి వచ్చి కౌంటర్‌లోని సుమారు రూ.2.50లక్షలు ఎత్తుకెళ్లారు. బుధవారం బార్ సిబ్బంది వచ్చి చూసేసరికి కౌంటర్‌లోని నగదు కనిపించలేదు. దీంతో యజమానితో పాటు పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం అక్కడకు చేరుకుని చోరీ ఘటనకు సంబంధించిన ఆధారాలు సేకరించారు. బార్ క్యాషియర్ రూ.2.50లక్షలు ఉండవచ్చని అంటుండగా పోలీసులు రూ.1.20 లక్షలుగా ప్రాథమిక అంచనా వేశారు. బార్ క్యాషియర్ ఆకారపు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

16న శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

- యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు

హన్మకొండ: శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఈ నెల 16(శనివారం)న ఘనంగా నిర్వహించనున్నట్లు యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజు యాదవ్ తెలిపారు. ఈమేరకు బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారత దేశంలోనే అత్యంత భారీగా ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు చెప్పారు. యాదవ కుల దైవం శ్రీ కృష్ణుడు, బలరాముడని తెలిపారు. ప్రస్తుతం సైన్స్, టెక్నాలజీ మీదనే విద్యార్థులు, యువకుల దృష్టి సారిస్తున్నారు. అందుకే భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర తెలియచెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్లుగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకు రాంనగర్ నుంచి శ్రీ కృష్ణుడి శోభాయాత్ర ప్రారంభమై అంబేద్కర్ కూడలి, పోలీస్ హెడ్‌క్వార్టర్, అశోక, బస్టాండ్ కూడళ్ల మీదుగా బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం వరకు సాగుతుందన్నారు. అనంతరం కాళోజీ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజుతో పాటు పార్టీలకతీతంగా నాయకులు పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణ జన్మాష్టమీ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు కన్నెబోయిన రాజయ్య యాదవ్, గిరబోయిన రాజయ్య యాదవ్, బొంగు అశోక్, కెంచ కుమారస్వామి, రాజేందర్, ఎల్లావుల కుమార్ యాదవ్, రజనీకుమార్, దూడయ్య, చెన్నమల్లు, బుట్టి శ్యాం యాదవ్, బొంగు రాజు యాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదవ వెల్ఫేర్ ట్రస్ట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ సుందర్ రాజు యాదవ్

పాముకాటుతో మహిళ మృతి



సుజాత(ఫైల్)

కురవి: పాముకాటుతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని తిర్మలాపురంలో చోటు చేసుకుంది. ఎస్సై గండ్రాతి సతీశ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూల సుజాత (35) మార్చి 10వ తేదీన మొక్కజొన్న చేనులో పనిచేస్తుండగా పాముకాటు వేసింది. దీంతో కుటుంబసభ్యులు మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లింది. దీంతో ఏప్రిల్ 2వ తేదీన హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏప్రిల్ 5వ తేదీన మళ్లీ మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

ఇంకా తేరుకోలేదు..!

- రెండు రోజులైనా వరంగల్ నగరంలోని పలు కాలనీలను వీడని వరద
- రోడ్లపై నీరు ఉండడంతో బయటకు వచ్చేందుకు భయం
- నిత్యావసరాలు లేక ఇబ్బందిపడుతున్న లోతట్టుప్రాంతవాసులు



వరంగల్ శివనగర్‌లో ఇంటిని చుట్టుముట్టిన వరద



వరంగల్ మైసయ్య నగర్‌లో నిలిచిపోయిన వరద

సాక్షి, వరంగల్: వరంగల్ నగరంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వరుణుడు సృష్టించిన వరద బీభత్సం ఇంకా చాలా కాలనీలను వీడలేదు. మంగళవారం రాత్రి వరంగల్‌లో 19 మిల్లీమీటర్లు, ఖిలా వరంగల్‌లో 19.3 మిల్లీమీటర్ల మోస్తరు వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తెరిపివ్వడంతో నగరంలోని ప్రధాన రహదారుల్లోని నిలిచిన నీరు క్లియర్ అయినా, మైసయ్యనగర్, వివేకానంద కాలనీ, మధురానగర్, పద్మానగర్, శివనగర్, సాకరాశికుంట, నాగేంద్రనగర్, ఎస్ఆర్ తోట, సంతోషిమాత కాలనీలను ఇంకా వరద వీడలేదు. ముఖ్యంగా వర్షపు నీరు బయటకు వెళ్లే స్టోమ్ వాటర్ డ్రెయిన్లు ఇరుకుగా ఉండడం వల్ల నీటి ప్రవాహంలో ఇబ్బందులు ఏర్పడి రోడ్లపైనే నిలిచిపోతోంది. డ్రెయినేజీలు, రహదారుల నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేయడం వల్లే ఈ కాలనీలకు ప్రతీ వర్షాకాలం తిప్పలు తప్పడంలేదనే విమర్శలొస్తున్నాయి. ఖిలా వరంగల్ అగర్త చెరువు వరదనీటి కాల్వల నిర్మాణం, అభివృద్ధి పనుల పేరుతో ఉర్సు చెరువుకట్లే కచ్చా నాలాను మూసివేయడం, అండర్ డ్రెయినేజీ, స్టోర్మ్ వాటర్ డ్రెయినేజీ నిర్మాణం, చేపల బ్రిడ్జి విస్తరణ, పెరికవాడ వరదనీటి కాలువ పనులతోపాటు నాలా విస్తరణ ఆలస్యం వల్లే ఇళ్లలోకి వరద చేరుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ జీవితాలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాతికోట ఉత్తర ద్వారం నుంచి పడమర ద్వారం వరకు నీరు నిలిచి ఉండడంతో అక్కడ సాగుచేసే ఆకుకూరలు, కూరగాయ తోటలు ఇంకా నీట మునిగే ఉన్నాయి. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్లడ్ లైట్లు కూడా వరదలోనే మునిగి ఉన్నాయి.

పెళ్లి పీటలపై ఆగిన మూడుముళ్ల బంధం..

- పెళ్లి కొడుకు తనను ప్రేమించాడని పోలీసులకు యువతి ఫిర్యాదు
- పోలీసుల సమాచారం మేరకు పెళ్లి ఆపిన వధువు కుటుంబ సభ్యులు

లింగాలఘణపురం: రెండుమూడు గంటల్లో పెళ్లి. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో ఫంక్షన్ హాల్ సందడిగా మారింది. కానీ ఇంతలో ఓ పిడుగు లాంటి వార్త. పెళ్లి కొడుకు తనతో ప్రేమాయణం సాగించాడని ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పెళ్లి కూతురు బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెళ్లి పీటల మీదనే మూడుముళ్ల బంధం ఆగింది. ఈ ఘటన మండలంలోని వడిచర్ల సమీపం ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం రాంరాజుపల్లికి చెందిన ఓ యువకుడికి అదే మండలంలోని మరో గ్రామానికి చెందిన యువతితో పెళ్లి నిశ్చయమైంది. బుధవారం వివాహం జరగాల్సి ఉంది. అంతా సిద్ధం చేసుకున్నారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పెళ్లి పీటలపై కూర్చునే సమయంలో సదరు యువకుడితో ప్రేమాయణం సాగించిన ఓ యువతి హైదరాబాద్‌లోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సదరు యువకుడు తనతో ప్రేమాయణం కొనసాగించి మరో యువతిని వివాహం చేసుకుంటున్నాడని తెలిపింది. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు సదరు యువకుడి వివరాలు తెలుసుకుని పెళ్లి కూతురు బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా ఫంక్షన్ హాల్‌లో ఆందోళన నెలకొంది. ఏం చేయాలో తెలియని పరిస్థితిలో యువకుడి బంధువులతో వాగ్వాదానికి దిగి పెళ్లిని ఆపారు. ఆ యువకుని విషయం తెలియాలని, అంతవరకు ఊరుకునేది లేదంటూ మండిపడి వధువు బంధువులంతా వెళ్లిపోయారు. ఫలితంగా రెండు మూడు గంటల్లో ఏకమయ్యే జంట విడిపోయింది. దీంతో వివాహానికి హాజరైన బంధువర్గమంతా అవాక్కై ఎక్కడివారక్కడ వెళ్లిపోయారు.



దోర్నకల్: పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వరుడి బంధువులు

యాదవనగర్‌లో మరో పెళ్లి..

దోర్నకల్: మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ యాదవనగర్‌లో కొద్ది గంటల్లో జరగాల్సిన వివాహ వేడుక అర్ధాంతరంగా ఆగింది. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ కథనం ప్రకారం.. యాదవనగర్‌కు చెందిన మహేశ్ పాతడోర్నకల్ చెందిన తన స్నేహితురాలిని నెల రోజుల క్రితం రహస్యంగా వివాహం చేసుకున్నాడు. ఈ విషయం మహేశ్ ఇంట్లో చెప్పలేదు. దీంతో కుటుంబ సభ్యులు మహేశ్‌కు వేరే సంబంధం చూసి బుధవారం పెళ్లికి ఏర్పాట్లు చేశారు. ఈ విషయం రహస్య వివాహం చేసుకున్న యువతి తెలుసుకుని డోర్నకల్ చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు వివాహ తంతును అడ్డుకుని మహేశ్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సదరు యువతి బెంగుళూరులో కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLATS FOR SALE

■ Ready to Occupy 1 BHK, 2BHK & 3 BHK Flats with all Facilities for Sale @ 941 Sqft to 1914 sqft with reasonable Prices at Vikas Nagar & Basith Nagar. Ph: 8897221187, 9177592357. [WA-6757]

REAL ESTATE

■ జీడికల్ Nr రామాలయం గజం కేవలం 4999/- లాంచింగ్ ఆఫర్, బుకింగ్ Rs. 108000. 1గ్రా. గోల్డ్ ఫ్రీ మార్కెటింగ్ ఏజెంట్స్ కావలి. ఫోన్: 6302280020 [SCA25007242]

SERVICES

■ హౌస్, ఓపెన్‌ప్లాట్, బిజినెస్ లోన్స్, ప్లాట్ పర్చేస్ లోన్స్, కన్‌స్ట్రక్షన్ మరియు ప్రవేట్ ఫైనాన్స్ ఇప్పించబడును. సంప్ర।। సెల్: 8096520976. [WA-6758]

WANTED

■ డ్రైవర్స్ భవాని ఖార గొర్రెకుంటలో పనిచేయుటకు DCM & బోలారో డ్రైవర్స్ కావలెను. ఫోన్ కాల్ టైమ్ 11am-6pm. Cell: 9396991649. [SCA25007145]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ।। అదనపు లైను 60/- రూ।। మాత్రమే 5% GST అదనము

■ షిరిడిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యభర్తలు కావలెను. ఫోన్: 8985114453, 9391036931 [HA-16124]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కాకతీయుల శిల్పకళ అద్భుతం

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

విద్యారణ్యపురి: కాకతీయుల శిల్పకళ అద్భుతమని, నాటి సాంకేతిక పరిజ్ఞానానికి నిదర్శనమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో 'కాకతీయాస్ టెంపుల్స్, ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ ప్రారంభ సభలో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాకతీయుల కాలంలో వివిధ కట్టడాల్లో నాటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాండ్‌బాక్స్ టెక్నాలజీని ఉపయోగించారన్నారు. ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ కాకతీయుల శిల్పకళా సాంస్కృతిక వైభవాన్ని తెలియజేసేందుకు ఈ వర్క్ షాప్ ఒక వేదికగా ఉపయోగపడుతుందన్నారు. సాంస్కృతిక పరిశోధకుడు, తెలంగాణ చరిత్ర బృందం అధ్యక్షుడు శ్రీరామోజు హరగోపాల్ కీలకపోన్యాసం చేస్తూ దక్షిణాసియాలోనే ప్రసిద్ధ హొజసాల చాళుక్య శైలులతో కూడిన కాకతీయుల శిల్పకళా ప్రసిద్ధిగాంచిందన్నారు. రామప్ప, వెయ్యిస్తంభాల ఆలయాల్లో అద్భుత సౌందర్యం దాగి ఉందన్నారు. వరంగల్ నిట్ విశ్రాంత ప్రొఫెసర్ పాండురంగారావు మాట్లాడుతూ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని ప్రకృతి విపత్తులనుంచి పరిరక్షించుకోవాలన్నారు. కేయూహిస్టరీ విభాగం విశ్రాంత ఆచార్యుడు కె.విజయబాబు మాట్లాడుతూ రామప్పదేవాలయంలో మదనిక, నాగిని వంటి శిల్పాల సౌందర్యం 800 సంవత్సరాలనాటి సాంకేతికత నేటితరానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అనంతరం కేయూ పాలకమండలి సభ్యుడు మల్లం నవీన్, హెరిటేజ్ యాక్టివిస్ట్ అరవింద్ ఆర్య, చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ అరుణ మాట్లాడారు. ఈ వర్క్‌షాప్‌లో కన్వీనర్ కొలిపాక శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు సురేశ్‌బాబు,శ్యామ్యూల్‌ప్రవీణ్‌కుమార్, యుగేంధర్, మధు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

యువతిపై సామూహిక లైంగికదాడి

- ఈ ఘటనలో పది మంది యువకుల అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ పండేరిచేతన్ నితిన్

జనగామ రూరల్: ఓ యువతిపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన పది మంది నిందితులను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జనగామ పట్టణానికి చెందిన ఓ యువతిపై పది మంది యువకులు మహమ్మద్ ఒవైసీ, ముత్యాల పవన్ కుమార్, బొద్దుల శివ కుమార్, నూకల రవి, జెట్టి సంజయ్, ఎం.డి అబ్దుల్ ఖయ్యూం, పుస్తకాల సాయి తేజ, ముత్తాడి సుమంత్ రెడ్డి, గుండ సాయి చరణ్ రెడ్డి, ఓరుగంటి సాయిరాం లైంగికదాడికి పాల్పడ్డారు. జూన్‌లో బాధితురాలిని సదరు యువకులు ప్రేమ, స్నేహం పేరుతో కారులో తీసుకుని జనగామ–సూర్యాపేట రోడ్‌లో గల 'టీ వరల్డ్' వెనుక ఉన్న ఒక రూమ్‌లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డారు. అందులో ఓ యువకుడు ప్రేమిస్తున్నానని బాధితురాలికి మాయమాటలు చెప్పి గోవాకు తీసుకెళ్లి అక్కడ కూడా పలుమార్లు శారీరకంగా కలిశాడు. ఈ ఘటనపై బాధితురాలి చిన్నమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం నిందితులు సిద్దిపేట రోడ్డులో ఉన్నారనే సమాచారం మేరకు సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సై భరత్ అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఏఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. యువత మత్తు పదార్థాలు సేవించినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అత్యవసర సమయాల్లో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్

విద్యుత్ పోటీల్లో వరంగల్ సర్కిల్ అత్యుత్తమ ప్రదర్శన



ఎస్ఈ మధుసూదన్ రావు, డీఈ టెక్నికల్ విజేందర్ రెడ్డికి ట్రోఫీలు అందజేస్తున్న క్రీడాకారులు

- హాకీలో ప్రథమ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం

హన్మకొండ: టీజీ ట్రాన్స్‌కో, టీజీ డిస్కంల ఇంటర్ సర్కిల్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ సర్కిల్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. కప్‌లు గెలుచుకున్నారు. 2025–2026 సంవత్సరానికిగాను టీజీ ట్రాన్స్ కో, టీజీ డిస్కంల ఇంటర్ సర్కిల్ పోటీలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగాయి. ఇందులో హాకీలో ఉమ్మడి వరంగల్ సర్కిల్ జట్టు ప్రథమ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించి ట్రోఫీలు అందుకుంది. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ పి.మధసూదన్ రావు, డీఈ టెక్నికల్, సేఫ్టీ ఆఫీసర్ విజేందర్ రెడ్డిని ఇరు జట్ల క్రీడాకారులు కలిసి ట్రోఫీలు అందించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను అభినందించారు.

అవయవదానంపై అవగాహన ఉండాలి

- తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి

హన్మకొండ: అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి అన్నారు. ప్రపంచ అవయవ దాన దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండ బాలసముద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏకశిల పార్కులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరికీ అవయవ దానం అవసరమని చాటి చెప్పేందుకే ప్రపంచ అవయవ దాన దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. దేశంలో అవయవలేమితో ప్రతీ సంవత్సరం ఐదు లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, దేశంలో అవయవదానం రేటు అతి తక్కువ ఉందన్నారు. ప్రతీ 10 లక్షల మందికిగాను 0.65 మంది దాతలుగా ముందుకు వస్తున్నారని వివరించారు. పాశ్చాత్య దేశాలు స్పెయిన్, క్రొయేషియాలో 10 లక్షల మందికి గాను 30 మంది దాతలు అవయవదానానికి ముందుకువస్తున్నారన్నారు. భారతదేశంలోనూ అవయవదాతలు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా అవయవదానంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు మల్లారెడ్డి, వేణు, ప్రతినిధులు ఎం.పద్మ, నిమ్మల శ్రీనివాస్, భారతి, విజయ కుమారి, నిర్మల, జనార్దన్ రెడ్డి, సత్యనారాయణ, పుల్లారెడ్డి, రాంబాబు, అంజలి, భాస్కర్, శ్రీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అవయవదానం పై ప్రతిజ్ఞ చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కల్వల వాసికి అరుదైన అవకాశం

- ఆసియా పసిఫిక్ గ్రామీణాభివృద్ధి కేంద్రంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా వెంకటమల్లు నియామకం



వెంకటమల్లు

కేసముద్రం: రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో రీసెర్చ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మహబూబాబాద్ జిల్లా కేసముంద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన తాడబోయిన వెంకటమల్లు అంతర్ ప్రభుత్వ సంస్థ సెంటర్ ఆన్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ ఏషియా అండ్ పసిఫిక్ (సీఐఆర్‌డీఏపీ)లో ప్రోగ్రాం ఆఫీసర్‌గా నియామకమయ్యారు. 15 దేశాల్లో గ్రామీణాభివృద్ధి పేదరిక నిర్మూలన కోసం ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆ సంస్థలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు వెంకటమల్లును అభినందించారు. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో ఉన్న ఆ సంస్థకు చెందిన ప్రధాన కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా తనను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు వెంకటమల్లు పేర్కొన్నారు.

మహిళా సంఘాలను మోసం చేసిన ఘటనలో ఒకరికి జైలు

నెల్లికుదురు: డ్వాక్రా మహిళాసంఘాలను మోసం చేసిన ఘటనలో తొర్రూరు కోర్టు.. ఒకరికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించినట్లు ఎస్సై చిర్ర రమేశ్ బాబు బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన జాటోత్ రామ్మూర్తి ఇదే గ్రామంలోని వరలక్ష్మి గ్రామైఖ్య సంఘం వీఓఏ హెల్పర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో 20 మహిళా సంఘాల పొదుపు డబ్బులు రూ. 4,15,781లను ఆ సంఘాల మహిళలకు తెలియకుండా తన సొంతానికి వాడుకున్నాడు. ఈ ఘటనపై వరలక్ష్మి గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు కోయగిరి అనిత 2015లో నెల్లికుదురు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అప్పటి ఎస్సై ఉపేందర్ రావు కేసునమోదు చేసి విచారణ చేసి కోర్టులో చార్జ్ షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాలు విన్న అనంతరం నేరం రుజువుకావడంతో తొర్రూరు కోర్టు మేజిస్ట్రేట్ ధీరజ్‌కుమార్.. నిందితుడు రామ్మూర్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్సై తెలిపారు.